ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా

- వలుచోట్ల బంకుల తొలగింపు
- సి.క్యాంపు స్కూల్ వద్ద బంకుల ఆక్రమణ కనిపించవా?




బిర్లా సర్కిల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై ఉన్న బంకులను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని పలు చోట్ల ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై నగరపాలక అధికారులు కొరడా ఝళిపించారు. మంగళవారం టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ప్లానింగ్ కార్యదర్శులు, చైన్‌మెన్లు వాటిని తొలగించారు. బిర్లాగడ్డ సమీపంలోని వాల్‌మార్టు ఎదురుగా ఫుట్‌పాత్‌లపై బంకులు ఏర్పాటు చేసుకొని కొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. అలాగే సి.క్యాంపు సెంటర్‌లో రాత్రికి రాత్రే బంకుల ఏర్పాటుకు సంబంధించి తడికెలు వేశారు. ఇలా ఎక్కడపడితే అక్కడ యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన బంకులను తొలగించారు. తొలగించిన బంకులను నగరపాలక కార్యాలయానికి తరలించారు. సి.క్యాంపు మెయిన్ రోడ్డుకు వేసిన బంకులను తొలగించిన మున్సిపల్ అధికారులకు అక్కడే మున్సిపల్ స్కూల్ వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన బంకులు మాత్రం కనబడలేదు. ఈ బంకుల వల్ల పాఠశాలలో చదివే విద్యార్థులకు, నిత్యం సి.క్యాంపు రైతు బజార్‌కు రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎక్కడపడితే అక్కడ బంకులు వెలుస్తున్నాయి. అశోక్ నగర్ నుంచి పున్నమి అతిథి గృహం, రామలింగేశ్వర్ నగర్, వెంకటరమణ కాలనీ వరకు దాదాపు సగానికి పైగా ఇక్కడ ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకున్నారు. దీంతో పాదచారులు ఫుట్‌పాత్‌లపై ఖాళీ లేక రోడ్లపై నడుచుకుంటూ వెళ్లాల్సివస్తోంది.

ఫుట్‌పాత్‌లు, స్ట్రీట్ మార్కెట్లను పట్టించుకోని అధికారులు

గత ప్రభుత్వంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిధులు వెచ్చించి అధ్వానంగా ఉన్న ఫుట్‌పాత్‌లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. 6 నెలల క్రితం రూ.10 లక్షలు వెచ్చించి రిలయన్స్ మార్టు సమీపంలో స్మార్ట్ స్ట్రీట్ పేరుతో ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అది కాస్తా నాసిరకం పనుల వల్ల దెబ్బతిన్నాయి. ఆటోవాలాలకు, చీకటి పడితే మందుబాబులకు, మల, మూత్రాలతో ప్రస్తుతం ఆ ఫుట్‌పాత్ కంపు కొడుతుంది. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపావడంతో అవన్నీ అధ్వానంగా తయారయ్యాయి. ఇక రూ.10 లక్షలు వెచ్చించి ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కార్యాలయం వద్ద అందంగా ఫుట్‌పాత్‌లను తీర్చిదిద్దారు. ఇప్పుడది కాస్తా చిరు వ్యాపారులకు, నర్సరీల అమ్మకాలు చేపట్టేందుకు అడ్డాగా మారింది. ఇక్కడే రూ.30 లక్షలు వెచ్చించి స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటు చేశారు. దీన్ని ఏర్పాటు చేసి నెలలు అవుతున్నా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇక కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్‌లోను ఇదే తరహాలో స్ట్రీట్ మార్కెట్లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వ్యాపారులతో ఇబ్బందులు వస్తున్నాయని గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వాటిని ఉపయోగంలోకి తీసుకురావడంలో మున్సిపల్ అధికారులు విఫలం చెందుతున్నారు. దీంతో అక్కడ స్ట్రీట్ మార్కెట్ వృథాగా మారింది. సమస్య మొదటికి వచ్చింది.

నెరవేరని లక్ష్యం

ఎక్కడపడితే అక్కడ వ్యాపారాలు చేసుకోవడం, రోడ్లపైకి రావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య వస్తోందని గత ప్రభుత్వం స్ట్రీట్ మార్కెట్, ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేసింది. నగరంలోని వినాయక ఘాట్, బిర్లాగేట్, ఐటీసీ సర్కిల్, అశోక్‌నగర్, వెంకటరమణ కాలనీ, పాతబస్టాండ్, కొండారెడ్డి బురుజు వంటి ముఖ్యమైన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని కొనసాగించడంలో విఫలం కావడంతో సమస్య మొదటికి వచ్చింది. వినాయక ఘాట్ వద్ద ట్రాఫిక్‌ను, వ్యాపారులను నియంత్రించేందుకు స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటు చేశారు. పక్కనే రోడ్డు మీద వ్యాపారాలు చేసుకుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని వీటిని ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మళ్లీ వ్యాపారులు రోడ్ల మీదకు వస్తూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. చోటా మోటా అధికార పార్టీ నేతల నుంచి వస్తున్న ఫోన్ల వల్లే ఇబ్బందులు వస్తున్నాయని మున్సిపల్ సిబ్బంది వాపోతున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరలేదన్న విమర్శలు ఉన్నాయి.

ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్‌కు చార్జ్ మెమో

కర్నూలు (టౌన్): నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రఫీకి సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.రాజశేఖర్ మంగళవారం సాయంత్రం చార్జ్ మెమో జారీ చేశారు. తాగునీటి సరఫరాలో 19, 20 వార్డులకు చెందిన కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయంపై పలుమార్లు సంబంధిత ట్యాప్ ఇన్‌స్పెక్టర్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి మార్పు లేదు. దీంతో నీటి సరఫరాలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న కారణంతో ఎస్‌ఈ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల వ్యవధిలో లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీఎస్ ఆర్టీసీలో కరోనా సమయంలో తొలగించిన 11 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో 26 మంది కార్మికులను ఆర్టీసీ యాజమాన్యం విధుల నుంచి తొలగించిందన్నారు. అయితే అనేక పోరాటాలతో 15 మందిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారని, 11 మందిని మాత్రం తీసుకోవడం లేదన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయిబాబా, రఫీ, నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వేస్టేషన్ పరిసరాలను అపరిశుభ్రం చేయరాదు



మొక్కలు నాటుతున్న రైల్వే సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): రైల్వే పరిసరాలను అపరిశుభ్రం చేయరాదని కర్నూలు రైల్వేస్టేషన్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.విజయకుమార్ ప్రజలకు సూచించారు. రైల్వే పరిసరాలు అందరికీ చెందినవని, అందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. అక్టోబర్ 1 నుంచి 15వ తేదీ వరకు రైల్వే శాఖ చేపట్టిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. చివరి రోజు రైల్వే స్టేషన్ సమీపంలో మొక్కలు నాటి నీరు పోశారు. అలాగే రైల్వే పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతా పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు.

బంపర్ డ్రా విజేతకు కారు



బంపర్ డ్రా కూపన్‌ను చూపుతున్న టీజీ వెంకటేష్, చిత్రంలో జీవీ మాల్ మేనేజర్లు

కర్నూలు కల్చరల్: దసరా పండుగ సీజన్ సేల్ సందర్భంగా జీవీ మాల్ వారు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహించిన 'నవరాత్రులు – జీవీ కానుకలు' సేల్ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం ఆ మాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో బంపర్ డ్రా కార్యక్రమం నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై బంపర్ డ్రాలో 'మారుతి వాగన్ ఆర్' కారు గెలుచుకునే లక్కీ విన్నర్ కూపన్‌ను ఎంపిక చేశారు. దొడ్డిపాడు గ్రామానికి చెందిన గట్టుగారి రాజు లక్కీ డిప్‌లో మారుతి వాగన్ ఆర్ కారు గెలుచుకున్నట్లు ప్రకటించారు. జీవీ మాల్ మేనేజర్లు ఎస్.రమేష్, ఇ.సాయిరాం, ఎం.రవికుమార్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రేపు వాల్మీకి మహర్షి జయంతి

కర్నూలు(అర్బన్): జిల్లా కలెక్టర్ పీ రంజిత్ భాష ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ గురువారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక గౌరీ గోపాల్ హాస్పిటల్ సమీపంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల అలంకరణ, 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సభ నిర్వహించి జయంతోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆమె కోరారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమిపూజ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు (రూరల్) : పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో మంగళవారం అభివృద్ధి పనులకు ఎంపీ బస్తిపాటి నాగరాజు భూమి పూజ చేశారు. అదేవిధంగా జి.శింగవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. రూ.9.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితులతో ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది

కోసిగి: మండల కేంద్రానికి చెందిన వెంకటేష్, తిక్కోడు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కోసిగి ఎస్ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామ రోడ్డులోని జగనన్న కాలనీ సమీపం నుంచి రెండు బైక్‌లపై 20 బాక్స్‌లలో 1920 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ (90ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని, బైక్‌లను సీజ్ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఏఎస్‌ఐ నాగరాజు, కానిస్టేబుల్ రాంప్రతాప్ ఉన్నారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం



చేతులను శుభ్రం చేసుకునే విధానాన్ని వివరిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): ప్రతిరోజూ చేతులను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని డెమో శ్రీనివాసులు చెప్పారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కర్నూలు బి.క్యాంపులోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయం మేరకు 2008 నుంచి ఏటా అక్టోబర్ 15న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం ×మన చేతులు–మన భవిష్యత్‌* అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవడం సులభతరమైన, అతి ముఖ్యమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న ఆరోగ్య భద్రతా విధానమని చెప్పారు. భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. చేతులను శుభ్రంగా కడుక్కోకపోతే అనేక వ్యాధులు వస్తాయన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, హెచ్‌ఎం ప్రశాంతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రూ.10 నాణేలను లావాదేవీలకు వినియోగించవచ్చు



రూ.10 నాణేలను పంపిణీ చేస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్ సుదర్శన్ భారిక్

కర్నూలు(అగ్రికల్చర్): రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని.. రోజువారీ లావాదేవీలకు వీటిని నిర్భయంగా వినియోగించవచ్చని కెనరా బ్యాంకు బాలాజీనగర్ శాఖ మేనేజర్ సుదర్శన్ భారిక్ తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు కెనరా బ్యాంకు రూ.10 నాణేల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం బ్రాంచీ పరిధిలో జరిగిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా వివిధ దుకాణాల నిర్వాహకులకు రూ.10 నాణేలు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ఈ నాణేలను వ్యాపార, వాణిజ్యాలకు, బ్యాంకుల్లో లావాదేవీలకు వినియోగించవచ్చని సూచించారు. వీటిని అన్ని దుకాణాలు, బ్యాంకులు ఆమోదిస్తాయని పేర్కొన్నారు. వినియోగదారులు ఎలాంటి సంకోచం లేకుండా 10 నాణేలను వినియోగించవచ్చని తెలిపారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా.. బ్యాంకులను సంప్రదించవచ్చని సూచించారు. కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలకు టాప్ నంబర్ తప్పనిసరి



ఆటోలకు డిజిటల్ టాప్ నంబర్‌ను అతికిస్తున్న పోలీసులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని ప్రతి ఆటోకు అక్టోబర్ ఆఖరులోపు డిజిటల్ టాప్ నంబర్‌ను తీసుకోవాలని ట్రాఫిక్ సీఐ ఎస్.మన్సూరుద్దీన్ సూచించారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులు నగరంలోని పలు చోట్ల ఆటోలకు డిజిటల్ టాప్ నంబర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ టాప్ నంబర్‌తో ప్రయాణికులకు సులభంగా ఆటోల సమాచారం తెలిసేలా ఉంటుందన్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగిన సమయంలో టాప్ నంబర్‌ను చెప్పితే వెంటనే అంబులెన్స్‌లు, ఇతర వాహనాలను తీసుకెళ్లి రక్షించడానికి అనువుగా ఉంటుందని చెప్పారు. సీఐటీయూ నాయకులు కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ, మహ్మద్,రవి, హుస్సేన్, వలీ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

కర్నూలు (టౌన్): నగరంలోని శివారు ప్రాంతాల ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం జొహరాపురంలోని బీడీ కార్మికుల కాలనీలో కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో మురుగు కాల్వలు లేవని, వర్షాలు వస్తే రోడ్లు బురదమయంగా మారుతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కమిషనర్ తక్షణమే తాత్కాలిక నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని, మురుగు కాల్వల నిర్మాణ ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: ఆలూరు మంలం మణెకుర్తి గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. పెసలబండ గ్రామానికి చెందిన ఉపేంద్ర, మౌనిక ఆలూరు మండలం దేవరగట్టులో మాళమల్లేశ్వర స్వామి దర్శనం చేసుకుని బైకుపై తిరిగి వస్తుండగా మణెకుర్తి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైకు ఢీకొంది. దీంతో ఉపేంద్ర, మౌనికకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఉపేంద్రను కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హేమలత

కల్లూరు: వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం చిన్నటేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. చేతుల పరిశుభ్రత ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఆరోగ్య విద్యాబోధకురాలు స్వర్ణగౌరి, ఆరోగ్య పర్యవేక్షకులు మద్దమ్మ, ఆరోగ్య కార్యకర్త విజయకుమారి, ఆశా కార్యకర్తలు రజని, వెంకటేశ్వరమ్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డు మృతి

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే మల్లయ్య (58) గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన ఆదివారం రాత్రి విధులు ముగించుకొని రాజ్‌విహార్‌కు చేరుకున్నారు. అక్కడ గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన కోలుకోలేక మృతి చెందినట్లు రెండవ పట్టణ పోలీసులు వెల్లడించారు.

బంగారుపేటలో ఇరు వర్గాల ఘర్షణ

కర్నూలు (టౌన్): బంగారు పేటలో మంగళవారం ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. పవన్, మస్తాన్ అనే ఇద్దరు వ్యక్తులు తమ సమీప బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు గుంతకల్లు నుంచి వచ్చారు. స్థానికంగా బంగారుపేట వద్ద వీరు మంచినీటి కోసం అదే కాలనీకి చెందిన కృష్ణతో గొడవ పడ్డారు. స్థానికులు కలవడంతో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ముగ్గురిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రెండవ పట్టణ పోలీసులు వెల్లడించారు.

అక్రమాలపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అక్రమాలపై విచారణ జరపాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీ నుంచి దూర విద్య పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వాహకులు అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కాపీ కొట్టడానికి రూ.2 వేలు, వేరే అభ్యర్థితో పరీక్ష రాయించడానికి రూ.5 వేలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

రూ.9.8 కోట్లతో రోడ్ల ప్యాచ్ వర్కులు

కరూలు న్యూసిటీ: జిల్లాలో వర్షాకాలంలో పాడైన రహదారులకు మరమ్మతులు, ప్యాచ్ వర్కులు చేయడానికి ప్రభుత్వం రూ.9.8 కోట్లు మంజూరు చేసినట్లు రోడ్లు, భవనాల పర్యవేక్షక ఇంజినీర్ పి.మహేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. టెండర్లు వేసేందుకు 16న చివరి తేదీ అని తెలిపారు. టెండర్లు పూర్తవ్వగానే దెబ్బతిన్న రహదారులు, కాల్వలు, కల్వర్టులను గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లు ఛిద్రమైన చోట, గుంతలు ఏర్పడ్డ రహదారుల ప్యాచ్ వర్కులను పూర్తి చేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించేంతదుకు కృషి చేస్తామని వివరించారు.

15 శాతం వృద్ధి సాధించేలా స్వర్ణాంధ్ర విజన్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఏడాదికి 15శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికను తయారు చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. మంగళవారం కలెక్టర్ తన చాంబరులో స్వర్ణాంధ్ర-2047 జిల్లా దార్శనిక ప్రణాళిక రూపకల్పనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల కాలంలో అభివృద్ధి లక్ష్యాలతో గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రణాళికలు రూపొందించుకొని వాటి సాధన కోసం కృషి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో అభివృద్ధిపై దృష్టి సారించామని తెలిపారు. ఓర్వకల్ పారిశ్రామిక వాడపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఓర్వకల్‌లో 4470 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందని చెప్పారు. మిగిలిన 5 వేల ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో మైనింగ్, క్వారీ పరిశ్రమల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై ప్రజాభిప్రాయంతో ప్రణాళికను రూపకల్పన చేస్తున్నామని వివరించారు. సీపీఓ హిమప్రభాకరరాజు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తం



తుంగభద్ర తీరాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (టౌన్): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని జొహరాపురం బ్రిడ్జి వద్ద హంద్రీ నది, అనంతరం పాతబస్తీలోని రాఘవేంద్ర స్వామి మఠం వెనుక తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భారీ వర్షాలు వస్తే ఎన్ని క్యూసెక్కుల మేర నీరు వచ్చే అవకాశం ఉంటుంది. ఏఏ ప్రాంతాలు ప్రభావితం అవుతాయి అనే వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 5 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ప్రస్తుతం 60 వేల క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే ఉందని అధికారులు తెలిపారు. మ్యాపు ద్వారా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో అల్ప పీడనం ప్రభావం అంతగా లేదని, అయినప్పటికీ అధికారులు అప్రమత్తంగా ఉండి పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలన్నారు. హంద్రీ నది చుట్టూ ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, ఆర్డీఓ సందీప్‌కుమార్, అర్బన్ తహసీల్దార్ వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

కలాం జీవితం యువతకు ఆదర్శం



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి, తదితరులు

కర్నూలు సిటీ: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామినాయక్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి కలాం అని, ఆయన జీవిత చరిత్ర యువతకు ఆదర్శమన్నారు. అణు పరిశోధనల్లో కలాం చేసిన సేవలను కొనియాడారు. అధ్యాపకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, చిన్న మల్లేశ్వరుడు, ఉల్గోజి రావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

కర్నూలు(సెంట్రల్): ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సాయిబాబా పీడిత వర్గాల ఆశాజ్యోతి అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం సీఆర్ భవన్‌లో నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన ప్రొఫెసర్ సాయిబాబా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కె.రామాంజనేయులు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రొఫెసర్ సాయిబాబాను అక్రమంగా 9ఏళ్ల జైల్లో బంధించిందన్నారు. జైలులో ఉన్న సమయంలో కనీస సదుపాయలు కల్పించలేదని, కులం ప్రతిపాదికన సదుపాయాలు కల్పిస్తున్నారన్న విషయాన్ని మొట్టమొదటి సారిగా బయటపెట్టిన వ్యక్తి సాయిబాబా అన్నారు. నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు నాగరాజు, గిడ్డమ్మ, శ్రీనివాసులు, బీసన్న, కుమార్, రాముడు పాల్గొన్నారు.

నేడు సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ఉద్యమకారుడు, కవి, మేధావి కామ్రేడ్ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభను ఈనెల 16వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వక్తలుగా భార్గవ, జంధ్యాల రఘుబాబు, పాణి, నాగేశ్వరాచారి హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన కరివేముల లక్ష్మన్న

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో సోమవారం కరివేముల లక్ష్మన్న (44) అనే వ్యక్తి ఇంటికి ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆస్పరి సీఐ మస్తాన్ వలి మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. కరివేముల లక్ష్మన్నకు భార్య, నలుగురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఎలాంటి భూములు లేనందున కూలీ పనులకు వెళ్లి జీవనం చేసేవారు. అయితే కొన్ని సంవత్సరాల నుంచి లక్ష్మన్న మద్యానికి బానిసయ్యాడు. నలుగురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయలేనని మనో వేదనతో కరివేముల లక్ష్మన్న ఉరివేసుకుని చనిపోయినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.